



# కరపత్రం

SINCE 2014

శనివారం డిసెంబర్ 7 2024 | సంపుటి :0 | సంచిక : 59 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# డ్రగ్స్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు: సీఎం రేవంత్‌రెడ్డి



**అంబేడ్కర్ అందించిన రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తయిందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ ఏర్పడిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. రాజకీయ ఒత్తిడి, పైరవీలకు తావులేకుండా పాలన అందిస్తున్నట్లు చెప్పారు.**

హైదరాబాద్: ఎలాంటి పైరవీలు లేకుండా పోలీసులకు పదోన్నతులు, బదిలీలు జరిపామన్నారు. పోలీసు, అగ్నిమాపక శాఖలో 15వేల మందికి నియామక పత్రాలు అందించామని తెలిపారు. పీజీలు, పీహెచ్‌డీలు చేసిన వారు కూడా కానిస్టేబుల్ ఉద్యోగాలకు వస్తున్నారన్నారు. "సైబర్, డ్రగ్స్ రూపంలో కొత్త నేరాలు పుట్టుకొస్తున్నాయి. గంజాయి, కొకైన్, హెరాయిన్.. మన రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్నాయి. యువతకు సైబర్ క్రైమ్ విభాగంలో శిక్షణ ఇవ్వాలని డీజీపీని కోరుతున్నా. టీజీ న్యాబ్‌కు డీజీపీ స్థాయి అధికారిని నియమించాం. కఠిన చర్యలు చేపట్టి గంజాయి, డ్రగ్స్‌ను అరికడుతున్నాం. డ్రగ్స్ రవాణాదారులు ఇక్కడికి రావాలంటేనే భయపడాలి. డ్రగ్స్ విష వలయం గురించి పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలి. ప్రత్యేక శిక్షణ పొందిన వారితో విద్యార్థులకు పాఠాలు చెప్పించాలి. పిల్లల భవిష్యత్తు గురించి పాఠశాలల యాజమాన్యాలకు బాధ్యత ఉండాలి. విద్యా సంస్థల యాజమాన్యాలతో పోలీసు కమిషనర్లు సదస్సులు నిర్వహించాలి. డ్రగ్స్ కేసులకు సంబంధించి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి 6 నెలల్లోగా తీర్పులు వచ్చేలా చూస్తాం" అని సీఎం తెలిపారు.

### మరణించిన హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

"రాష్ట్రంలో 14వేల మంది హోంగార్డులు ఉన్నారు. వారికి రోజుకు రూ.1000 వేతనం ఇస్తాం. హోంగార్డుల వీక్లీ పరేడ్ అలవెన్స్‌ను రూ.200 చేస్తాం. మరణించిన హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇస్తాం. వారికి మెరుగైన సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జనవరి 1లోగా అందించేలా చర్యలు తీసుకుంటాం. పోలీసుల పిల్లల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందిస్తాం. యంగ్ ఇండియా పోలీస్ స్కూలుకు 50 ఎకరాలు కేటాయించాం. హోంగార్డు నుంచి డీజీపీ వరకు ఏ హోదాలో ఉన్నా.. వారి పిల్లలు ప్రవేశం పొందవచ్చు.

# ఇదీ తెలంగాణ చరిత్రపైన కేసీఆర్ చేసిన చెరగని మరో సంతకం..

## యాదాద్రి పవర్ స్టేషన్‌పై కేటీఆర్ ట్వీట్

- నల్లగొండ జిల్లా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రారంభానికి సిద్ధమైంది.
- ఈ పవర్ స్టేషన్‌ను శనివారం జాతికి అంకితం చేయనున్నారు.
- ఈ నేపథ్యంలో ఇదీ తెలంగాణ చరిత్రపైన కేసీఆర్ చేసిన చెరగని మరో సంతకం అని పేర్కొంటూ వైటీపీఎస్‌పై కేటీఆర్ ట్వీట్ చేశారు.



హైదరాబాద్ : ఇదీ కేసీఆర్ ఆనవాళ్లు..! నల్గొండ జిల్లాలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ రేపు ప్రారంభమవుతున్న సందర్భంలో ఈ పవర్ ప్లాంట్ నిర్మాణం వెనక ఉన్న కేసీఆర్ దార్శనికత, కృషి తెలంగాణ ప్రజలకు చిరకాలం గుర్తుంటుంది అని కేటీఆర్ పేర్కొన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ కేసీఆర్ దీర్ఘ దృష్టికి, భారీ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో అనితరసాధ్యమైన వేగానికి మరొక ఉదాహరణ అని కొనియాడారు.

వైటీపీఎస్ పూర్తి సామర్థ్యం 4000 మెగావాట్లు (5ఐ800).. స్వతంత్ర్య భారత చరిత్రలోనే ఒక రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో ఉన్న అతిపెద్ద థర్మల్ పవర్ ప్లాంట్ ఇదే అని కేటీఆర్ తెలిపారు. వైటీపీఎస్ నిర్మాణాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం బీహెచ్ఈఎల్‌కు అప్పగించింది. దాదాపు రూ.20,400 కోట్ల విలువైన ఆర్డర్, భారత విద్యుత్ రంగ చరిత్రలో ఒక ప్రభుత్వ రంగ సంస్థకు ఇవ్వబడిన అత్యంత విలువైన ఆర్డర్‌గా నిలిచిందని కేటీఆర్ పేర్కొన్నారు.

నిత్య కరెంట్ కోతలు, వారానికి రెండు రోజుల పవర్ హాలీడేల దుస్థితి నుంచి అన్ని రంగాలకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా తెలంగాణను తీర్చిదిద్దిన కేసీఆర్ దార్శనికతలో ఒక భాగమే యాదాద్రి పవర్ ప్లాంట్. 2014లో కేవలం 7778 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం మాత్రమే ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలంలో తెలంగాణలో స్థాపిత సామర్థ్యాన్ని దాదాపు 20,000 మెగావాట్లకు చేరుకొనేలా చేసింది.. ఇది దేశ చరిత్రలో ఎన్నడూ చూడని విజయగాథ అని కేటీఆర్ ప్రశంసించారు.

12

# ఇది దళితుల మీద కక్ష్యా..?

## మహనీయులు అంబేద్కర్ మీద వివక్షా..? : కేటీఆర్



తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టించిన అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించకుండా నిర్బంధిస్తారా..? అని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు.

12

# తెలంగాణలో మూడు రోజులు వర్షాలు: వాతావరణ శాఖ




హైదరాబాద్: తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. వచ్చే వారం రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండబోదని వెల్లడించింది. రాష్ట్రంలోకి కింది స్థాయి గాలులు ప్రధానంగా తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్నట్లు పేర్కొంది.



## ప్రజలకు ఏం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలు?: భాజపా ఎంపీ ఈటల

- రాజ్యాంగ స్ఫూర్తిని ప్రధాని నరేంద్రమోదీ సమున్నతంగా కాపాడుతున్నారని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.
- అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా భాజపా రాష్ట్ర కార్యాలయంలో నివాళులర్పించిన అనంతరం ఈటల మాట్లాడారు.
- ఈ దేశంలో ఉత్పత్తి అయిన సమస్త సంపద.. సమస్త ప్రజల అవసరాలను తీర్చాలని చెప్పిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు.

12

## మలక్‌పేట మెట్రో స్టేషన్ కింద అగ్ని ప్రమాదం.. వాహనాలు దగ్ధం

హైదరాబాద్: మలక్‌పేట మెట్రో స్టేషన్ కింద శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మెట్రో స్టేషన్ కింద పార్క్ చేసిన ఐదు బైక్‌లు దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా మంటలు అంటుకుని దట్టమైన పొగ వ్యాపించడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలుఆర్పివేశారు. ఈ ఘటనతో మలక్‌పేట - దిల్‌సుఖ్‌నగర్ మధ్య రాకపోకలకు కాసేపు అంతరాయమేర్పడింది.

12



## కేటీఆర్.. తెలంగాణ కోసం మీరు చేసిన త్యాగం ఏమిటో చెప్పాలి: మహేశ్‌గౌడ్




12

# ఇది దళితుల మీద కక్ష్యా..?

## మహనీయులు అంబేద్కర్ మీద వివక్షా..? : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ : ఇది దళితుల మీద కక్ష్యా..? మహనీయులు అంబేద్కర్ మీద వివక్షా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు వెళ్తున్న పలువురు బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ సర్కార్ గృహ నిర్బంధం చేసిన సంగతి తెలిసిందే. ఈ హౌజ్ అరెస్టులపై కేటీఆర్ఎస్ ఎక్స్ వేదికగా స్పందించారు.

రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతాడు. ఆ రాజ్యాంగం రచించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని కేసీఆర్ గౌరవంగా తెలంగాణ నడిబొడ్డున హుస్సేన్ సాగర్ తీరాన సగౌరవంగా ప్రతిష్టించారు. అదే రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన సీఎం రేవంత్ కనీసం మహనీయుడు అంబేద్కర్ జయంతి, వర్ధంతులకు కనీసం దండేసి, దండంపెట్టి స్మరించుకునే అవకాశం ఇవ్వడం లేదని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన సచివాలయంలో, పోలీస్ కంట్రోల్ రూమ్‌లో సమీక్షలు చేస్తారు రేవంత్ రెడ్డి. కేసీఆర్ నిర్మించిన ఫ్లై ఓవర్లను, యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తూ.. కేసీఆర్ ప్రతిష్టించిన అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించకుండా నిర్బంధిస్తారా..? అని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇది దళితుల మీద కక్ష్యా..? మహనీయులు అంబేద్కర్ మీద వివక్షనా..? అని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చివరకు జాగో తెలంగాణ జాగో అని కేటీఆర్ పేర్కొన్నారు.

### కిలో గోల్డ్ బిస్కెట్లు.. ?23 కోట్ల నగదు.. శ్రీకృష్ణ ఆలయానికి భారీగా హుండీ ఆదాయం



ప్రఖ్యాత శ్రీకృష్ణుడి ఆలయ హుండీకి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. రెండు నెలల తర్వాత హుండీ లెక్కింపు చేపట్టగా.. కిలో బంగారు బిస్కెట్లు, రూ.23 కోట్లకు పైగా విలువైన నగదు కానుకలుగా వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

చిత్తోర్‌గఢ్: రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్ సమీపంలోని ప్రసిద్ధ శ్రీకృష్ణుడి ఆలయ హుండీకి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. రెండు నెలల తర్వాత హుండీ లెక్కింపు చేపట్టగా.. కిలో బంగారు బిస్కెట్లు, రూ.23 కోట్లకు పైగా విలువైన నగదు కానుకలుగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. శ్రీకృష్ణ భగవానుడికి చిన్న చిన్న బంగారు బిస్కెట్లు, వెండి కళాఖండాలు, వెండి పిస్టల్, వేణువులు వంటి ప్రత్యేక వస్తువులను సైతం భక్తులు ప్రేమతో కానుకలు సమర్పించుకున్నారని అధికారులు వివరించారు. ఆలయానికి ఇప్పటివరకు వచ్చిన ఆదాయంలో ఇదే అతి పెద్ద మొత్తమని పేర్కొంటున్నారు.

విరాళాలు భారీగా ఉండటంతో దశల వారీగా లెక్కిస్తున్నారు. ఇప్పటివరకూ రూ.23 కోట్లకు పైనే నగదు విరాళాలు అందినట్లు పేర్కొన్నారు. ఇంకా లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. బంగారం, వెండి వస్తువులు, హుండీల నుంచి సేకరించిన వివిధ వస్తువులను తూకం వేసి వాటి విలువను మదింపు చేస్తున్నారు. చిత్తోర్‌గఢ్ – ఉదయ్‌పుర్ హైవేలో ఉండే సన్వాలియా సేథ్ ఆలయం. చిత్తోర్‌గఢ్ నుంచి 40కి.మీ దూరంలో ఉంటుంది.

### శబరిమలలో నటుడికి వీఐపీ దర్శనం.. తప్పుబట్టిన కేరళ హైకోర్టు




కొచ్చి: శబరిమల లోని అయ్యప్ప క్షేత్రంలో నటుడికి వీఐపీ దర్శనం కల్పించడాన్ని కేరళ హైకోర్టు తప్పుబట్టింది. ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ)పై ఆగ్రహం వ్యక్తం చేసింది. మలయాళ నటుడు దిలీప్ గురువారం శబరిమలలోని అయ్యప్ప క్షేత్రాన్ని దర్శించుకున్నారు. టీడీబీ ఆయనకు వీఐపీ దర్శనం కల్పించింది. ఈ సమయంలో భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి చూడాల్సి వచ్చింది. కొందరు భక్తులు దేవుడిని దర్శించుకోకుండానే వెనుదిరిగారు. దీనిపై మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా కేరళ హైకోర్టు ఈ విషయాన్ని సుమోటోగా తీసుకొని విచారించింది.

చాలా సమయంపాటు నటుడు ఆలయంలో ఉండటానికి ఎలా అనుమతిచ్చారని టీడీబీని ప్రశ్నించింది. ఆయన వల్ల పిల్లలు, వృద్ధులు సహా ఇతర భక్తులు గంటల తరబడి లైన్లలో వేచి ఉండాల్సి వచ్చిందని పేర్కొంది. యాజమాన్యమే ఇలా ప్రవర్తిస్తే.. భక్తులు ఎవరికి ఫిర్యాదు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేసింది.

రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులకు మాత్రమే వీఐపీ దర్శనం కల్పించాల్సి ఉంటుందని.. ఇతరులకు ప్రత్యేక దర్శనం కల్పించడం నిబంధనలకు విరుద్ధమని.. టీడీబీపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టి శనివారంలోగా ఈ విషయానికి సంబంధించిన వీడియో ఫుటేజీ, నివేదికను కోర్టుకు సమర్పించాలని న్యాయమూర్తులు జస్టిస్ నరేంద్రన్, జస్టిస్ మురళీ కృష్ణలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. నటుడిని ప్రతివాదిగా చేర్చాలని వస్తున్న డిమాండ్లను పరిశీలిస్తామని తెలిపింది. కాగా ప్రస్తుతం కేరళలో కొనసాగుతున్న వార్షిక మండలం–మకరవిళక్కు యాత్ర సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు దర్శనానికి పోటెత్తుతున్నారు.

### శంభు సరిహద్దుల్లో ఉద్రిక్తత.. రైతులపై బాష్పవాయువు ప్రయోగం

దిల్లీ: పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంతోపాటు తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ.. హరియాణా, పంజాబ్ రైతులు చేపట్టిన ' దిల్లీ చలో' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. సంయుక్త కిసాన్ మోర్చ నేతృత్వంలో వందలాది మంది రైతులు శంభు సరిహద్దు గుండా రాజధానిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, రైతుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. బారికేడ్లను దాటుకొని రైతులు దిల్లీ వైపు కదిలేందుకు యత్నించారు. ఈ క్రమంలో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు.

మరోవైపు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కనీస మద్దతు ధరపై పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేశారు. వ్యవసాయ ఉత్పత్తులను కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మోదీ గ్యారంటీని కచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. ఉత్పత్తి ధరకంటే కనీసం 50శాతం అధికంగా చెల్లించి పంటను కొనుగోలు చేయాలన్న ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను పరిగణనలోకి తీసుకోలేమని గతంలో కాంగ్రెస్ చెప్పిందని చౌహాన్ సభకు వివరించారు. కానీ, మోదీ ప్రభుత్వం ఇప్పటికే ధాన్యం, గోధుమలు, సోయాబీన్, జొన్న పంటలకు ఉత్పత్తి ధరకంటే 50 శాతం అధికంగా చెల్లించి కొనుగోలు చేస్తోందని వివరించారు.

### శ్రీశైల మల్లన్న సేవలో నాగచైతన్య, శోభిత



శ్రీశైలం: ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగార్జున కుటుంబం శ్రీశైల మల్లన్నను దర్శించుకుంది. ఇటీవల నాగచైతన్య, శోభిత వివాహం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నూతన వధూవరులతో కలిసి కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం నూతన దంపతులకు అర్చకులు వేదాశీర్వచనం పలికారు. తొలుత ఆలయ మహాద్వారం వద్ద వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఈ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి.

ఇక నాగచైతన్య– శోభిత పెళ్లి ఫొటోలను తాజాగా నాగార్జున తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన విషయం తెలిసిందే. మీడియాకు, ఫ్యాన్స్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'డియర్ ఫ్రెండ్స్, ఫ్యామిలీ, ఫ్యాన్స్.. మీ ప్రేమ, ఆశీస్సులు ఈ వేడుకను ప్రత్యేకం చేశాయి. ఈ అందమైన క్షణాల్లో మమ్మల్ని అర్థం చేసుకున్న మీడియాకు ధన్యవాదాలు. కృతజ్ఞతతో నా హృదయం ఉప్పొంగుతోంది' అని పేర్కొన్నారు.

## డ్రగ్స్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

**నేరగాళ్ల హోదా చూసి పోలీసులు వెనక్కి తగ్గొద్దు..**

రాష్ట్రంలో మొత్తంగా 94 వేల మంది పోలీసులు ఉన్నారు. ఎక్కడ తీవ్రవాద కార్యకలాపాలు జరిగినా మన పోలీసుల సాయం తీసుకుంటాం. పోలీసు ఉద్యోగం భావోద్వేగం.. ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచే బాధ్యత. బాధితుల పట్ల పోలీసులంతా గౌరవంగా, మర్యాదగా మెలగాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే నేరగాళ్లు, కబ్జారాయుళ్లకు అండగా ఉండటం కాదు. పోలీసు పేరు వినిపిస్తే చాలు.. నేరగాళ్లు భయపడేలా ఉండాలి. కొందరు పోలీసుల తీరు కారణంగా అందరికీ చెడ్డ పేరు వస్తుంది. నేరగాళ్ల పట్ల కఠిన వైఖరి ప్రదర్శించాలి. స్టేషన్‌కు వచ్చిన ఏ ప్రజాప్రతినిధి అయినా మర్యాదగా వ్యవహరించాలి. పేదలు, సామాన్యులు, బాధితులకు పోలీసులు అండగా ఉండాలి. నేరగాళ్ల హోదా చూసి పోలీసులు వెనక్కి తగ్గొద్దు. విధి నిర్వహణలో మరణించిన అధికారులు, పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటాం.

**ట్రాన్స్‌జెండర్లకు అండగా ఉంటాం..**

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చూడాలి. ట్రాన్స్ జెండర్ల సమస్యలను ప్రతి ప్రభుత్వం మానవీయ కోణంలో చూడాలి. ట్రాన్స్ జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమిస్తున్నాం. వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇస్తాం. వారికి మా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది" అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### కొడనాడు కేసు.. మద్రాసు హైకోర్టు కీలక ఆదేశాలు



చెన్నై: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కొడనాడు హత్య, దోపిడీ కేసులో మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి ప్రతిపక్ష ఏఐఏడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి , శశికళ తదితరులను విచారించేందుకు సీబీసీఐడీ పోలీసులకు అనుమతిచ్చింది. వారిద్దరినీ విచారించకుండా ఊటిలోని జిల్లా కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది.

2017లో కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన హత్య, దోపిడీ కేసుపై తొలుత పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దాదాపు ఐదేళ్లపాటు దర్యాప్తు కొనసాగినా ఎలాంటి ఫలితం లేకపోయింది. ప్రభుత్వం మారిన తర్వాత కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించారు.

శంభు సరిహద్దుల్లో ఉద్రిక్తత.. రైతులపై బాష్పవాయువు ప్రయోగం

ఈ కేసులో ఇప్పటి వరకు 10 మందిని అరెస్టు చేయగా.. సుమారు 100 మందిని విచారించారు. ఈ కేసులో పళనిస్వామి, శశికళను విచారించేందుకు గతంలో దిగువ కోర్టు అనుమతి ఇవ్వలేదు. దీంతో సీబీసీఐడీ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం విచారణకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా ఎస్టేట్‌లో కనిపించకుండా పోయిన కొన్ని విలువైన వస్తువుల గురించి శశికళ, ఇళవరసిని ప్రశ్నించాలని ఆదేశించింది. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన కొడనాడు ఎస్టేట్‌లో 2017లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి కాపలాదారుడు ఓం బహదూర్‌ను హత్య చేసి,

### అదానీని సీఎం స్టాలిన్ కలవలేదు.. వదంతులు వ్యాప్తి చేస్తే ఊరుకోం!

చెన్నై: ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కలవలేదని, అదానీ గ్రూపుతో ఎలాంటి కాంట్రాక్టుపైనా సంతకం చేయలేదని ఆ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి వి.సెంథిల్ బాలాజీ స్పష్టం చేశారు. ఈ అంశంపై ఎవరైనా వదంతులు వ్యాప్తి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎంకే హయాంలో ఆ సంస్థతో ఎలాంటి ఒప్పందం చేసుకోలేదన్నారు.

సీఎం స్టాలిన్ అదానీని కలిశారని, అధిక ధరకు సోలార్ విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నారంటూ ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను, మీడియా కథనాలను బాలాజీ ఖండించారు. అదంతా కల్పిత ప్రచారమేనన్నారు. డీఎంకే హయాంలో ఎలాంటి ఒప్పందమూ కుదుర్చుకోలేదని స్పష్టం చేశారు. యూనిట్‌కు రూ.7.01 చొప్పున విద్యుత్ కొనుగోలుకు సంబంధించిన కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. అన్నాడీఎంకే హయాంలో రామనాథపురం జిల్లాలో అదానీ గ్రూపునకు చెందిన 648 మెగావాట్ల సోలార్ ప్లాంట్ నుంచి విద్యుత్ కొనుగోలు కోసం 2015లో చేసుకున్న ఒప్పందాన్ని డీఎంకే ప్రభుత్వం చేసుకున్నట్లుగా చిత్రీకరించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. సుప్రీంకోర్టులో ఉన్న కేసును పక్కనపెట్టి తెలిసీ తెలియకుండా మాట్లాడుతున్నారన్నారు. సీఎం ప్రతిష్ఠను దిగజార్చేలా తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు.

### కాంగ్రెస్ నిర్బంధిస్తున్నది బీఆర్ఎస్ నేతలను కాదు.. అంబేద్కర్‌ని: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న వారిపై దండిగా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. అంబేద్కర్ విగ్రహం దగ్గర ఎలాంటి ఏర్పాట్లు చేయలేదన్నారు. వందల మంది పోలీసులను పెట్టి తమను నిర్బంధిస్తున్నారని విమర్శించారు. గురుకులాల్లో 48 మంది విద్యార్థులు చనిపోయారన్నారు. గురుకుల విద్యార్థులను తాము ఎవరెస్ట్ శిఖరాలు ఎక్కిస్తే.. మీరు పాడె ఎక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదేనా మీరు అంబేద్కర్‌కు ఇచ్చే నివాళి అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ గురుకుల బాటను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు.

ఉత్తరప్రదేశ్‌లో రాహుల్ గాంధీని అడ్డుకుంటే సీఎం రేవంత్ రెడ్డి రాజ్యాంగం గురించి మాట్లాడుతాడని, అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలను అడ్డుకోవడం ఎంతవరకు కరెక్టని విమర్శించారు. రాహుల్ గాంధీ చెప్పేదొకటి చేసేదొకటన్నారు. మీ సీఎంకు జ్ఞానోదయం చేయాలంటూ రాహుల్ గాంధీకి సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ అసమర్థతను ఎండగడుతామని చెప్పారు. మర్యాద అనేది ఇచ్చిపుచ్చుకునేదని, కావాలని అడుక్కుంటే రాదని ఎద్దేవా చేశారు. కనీసం నెల రోజులు సమావేశాలు జరగాలన్నారు. సచివాలయంలో రేవంత్ రెడ్డి ప్రతిష్టిస్తున్నది తెలంగాణ తల్లి విగ్రహమా లేదా కాంగ్రెస్ తల్లి విగ్రహమా అని ప్రశ్నించారు. ప్రభుత్వం మారినప్పుడల్లా లోగోలు, నంబర్ ప్లేట్లు మారాలా అని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టారని విమర్శించారు. ఉద్యమ సమయంలో ప్రజలు స్వచ్ఛందంగా తెలంగాణ తల్లి విగ్రహాలు పెట్టుకున్నారని చెప్పారు. నాలుగేండ్ల తర్వాత ఎక్కడ తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలో.. ఎక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం ఉండాలో అక్కడికి పంపిస్తామన్నారు.

### కేటీఆర్.. తెలంగాణ కోసం మీరు చేసిన త్యాగం ఏమిటో చెప్పాలి: మహేశ్‌గౌడ్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: పదేళ్ల భారాస పాలనలో 50వేల ఉద్యోగాలిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలల్లోనే 50వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ మార్క్ పాలన కనిపిస్తోందని, ప్రజాపాలన పండుగలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

"మా ప్రభుత్వం వచ్చాక ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరుస్తున్నాం. పదేళ్ల భారాస పాలనలో మీరు చేసిన దోపిడీ ఇంతా అంతా కాదు. మళ్లీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ పగటికలలు కంటున్నారు. రూ.లక్షల కోట్లు కొల్లగొట్టిన మీకు మళ్లీ అధికారం ఎందుకిస్తారు?సామాన్యుడి పాలన ఈ రాష్ట్రంలో జరుగుతున్న నేపథ్యంలో.. తెలంగాణ ప్రజల యాస, భాష, కట్టుబాట్లు, సంస్కృతికి అద్దంపట్టే విధంగా తెలంగాణ తల్లి విగ్రహం ఉంటుంది. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని కేటీఆర్ అంటున్నారు. రాజీవ్ చేసిన సేవల గురించి కేటీఆర్‌కు తెలియదా? దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం గురించి మాట్లాడే హక్కు మీకు లేదు. తెలంగాణ కోసం మీరు చేసిన త్యాగం ఏమిటో చెప్పాలి? పదేళ్ల పాటు తెలంగాణ సంపద దోచుకున్న కుటుంబం.. కేసీఆర్ కుటుంబం. భూములు, నిధులు, నియామకాల పేరుతో అడ్డంగా దోచుకున్నారు" అని విమర్శించారు.

### ప్రజలకు ఏం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలు?: భాజపా ఎంపీ ఈటల

మొదటిపేజీ తరువాయి




ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలు ప్రజలకు సేవకులుగా ఉండాలని చెప్పారన్నారు. వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి ఆశయాలను గుర్తు చేసుకొని అమలు చేయడానికి కృషి చేయాలని కోరారు. "రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత హామీలతో ప్రజలను దగా చేస్తోంది. ప్రజలకు ఏం చేశారని సంబరాలు చేసుకుంటున్నారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడతాం. సీఎం రేవంత్‌రెడ్డి ఏం సాధించారని అన్ని వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. హోదా, స్థాయి మరిచి ఆయన చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. కిషన్‌రెడ్డికి డీఎన్ఏ పరీక్ష జరగాలన్న వ్యాఖ్యలకు శిక్ష తప్పదు. కాంగ్రెస్ దుర్మార్గాలను ఖండిస్తూ నిర్వహించే సభకు ముఖ్య అతిథిగా భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరవుతారు" అని ఈటల రాజేందర్ చెప్పారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం డిసెంబర్ 7 2024

# జ్యోతిషం ఒక ప్రామాణిక శాస్త్రం

## ప్రత్యేక వ్యాసం

డా. నమిలకొండ శ్రీధరాచార్యులు ఎం.ఏ జ్యోతిషం.
నిన్నటి రోజు జ్యోతిషం అర్థం తెలుసుకున్నాము.
ఈరోజు జ్యోతిష గణన ప్రాముఖ్యత తెలుసుకుందాం.




**కరపత్రం డిసెంబర్ 6**

హిందూ జీవన విధానంలో, దైవ పూజలో 108 సంఖ్య చాలా ప్రాముఖ్యత కలిగి ఉన్నది. 108 సార్లు దైవ నామ స్మరణ, దైవ ప్రదక్షిణాలు అంటూ ఉంటారు. ఈ 108 సంఖ్య శాస్త్రీయ నిర్దేశం ఇప్పుడు తెలుసుకుందాం. 108 అనేది ఒక సంఖ్య. జ్యోతిషం గురించి మనం చర్చించుకుంటున్న విషయంలో ఈ సంఖ్య ప్రాముఖ్యత గురించి ఈ వివరాలను మనసుపెట్టి ఆలోచిద్దాం. సృష్టి ఆరంభానికి మూలం 108. మానవ జీవితానికి ఊపిరులూదడానికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అంబులెన్స్ సంఖ్య కూడా 108. 108 సృష్టికి మూల సంఖ్య అని ఎలా చెబుతాం? 1+0+8=9. ఈ తొమ్మిది సంఖ్య నిత్యజీవితంలో చాలా విలువైనది. ఒక జపమాలలో 108 పూసలు ఉండడం మనకి తెలుసు. 108 కూడితే వచ్చే సంఖ్య 9. నవ గ్రహాలు కూడా 9. మనం శాస్త్ర పరం గా చూసే నక్షత్రాలు 27. అంటే 2+7R9. మళ్ళీ తొమ్మిది. ఒక్కో నక్షత్రం 4 పాదాలుగా విభజింపబడి ఉన్నది. ఉదాహరణ : అశ్విని ఒకటవ,రెండవ,మూడవ,నాలుగవ పాదం అంటారు కదా.. అలా ప్రతి నక్షత్రం 4 పాదాలుగా విభజింపబడి ఉంటుంది. ఇప్పుడు 27 నక్షత్రాలను 4 పాదాలతో హెచ్చిస్తే 108 వస్తుంది. అంటే అన్ని కూడితే వచ్చే సంఖ్య 9. నవగ్రహాలు అన్నాం కదా... ఈ నవ గ్రహాలు 12 రాశులకు ఆధిపత్యం వహిస్తాయి. 12 రాశులు x 9 గ్రహాలు.. 12x9R108 . మళ్ళీ 9. మన భూమి వ్యాసం కన్నా.. సూర్యుని వ్యాసం 108 రెట్లు పెద్దది. మన భూమికి సూర్యునికి మధ్య దూరం.. సూర్యుని వ్యాసం కన్నా రమారమి 108 రెట్లు ఉంటుంది. అలాగే మనకి చంద్రునికి మధ్య దూరం కూడా.. చంద్రుని వ్యాసం కన్నా భూమి దూరం సగటున108 రెట్లు. ఈమధ్యనే అందరూ షేర్ చేసిన వార్త శ్రీ తులసీదాస్ విరచిత రామచరిత మానస్ లో ప్రస్తుతించిన హనుమాన్ చాలీసా లో "యుగ సహస్ర యోజన పర భానూ లీల్యోత్సాహి మధుర ఫల జానూ" నిజమని నాసా లెక్కలు చెబుతున్నాయి. భూమికి సూర్యుడికి మధ్య ఎంత దూరం అని తెలుసుకోవడానికి, అమెరికా లోని అంతరిక్ష కేంద్రం "నాసా" సంవత్సరాల తరబడి ప్రయోగాలు చేసి మొత్తానికి ఆ దూరం 1536000000 కి.మీ. అని తేల్చింది. మన దేశంలో పామరులు పాడుకునే హనుమాన్ చాలీసా ను డీకోడ్ చేస్తే




నాసా చెప్పింది మన హనుమాన్ చాలీసా శ్లోకంలో చెప్పింది ఒక్కటే అని తెలిసింది. ఇక ఇప్పుడు హేతు వాదులు, జన విజ్ఞాన వేదికలు ఈ విషయం పై చర్చించవు. ఈ శ్లోకం పాడుకోవడం మూడ భక్తి అనగలమా? నిత్యం హనుమాన్ చాలీసా పారాయణం చేయడం ఒక ఆచారంగా మార్చుకున్న పామరులకు కూడా ఆ శాస్త్ర జ్ఞానం తెలియదు.. ఒక నమ్మకాన్ని ఆచారంగా చేసుకుని జ్ఞానాన్ని యుగ యుగాలుగా కాపాడుతున్న ఈ దేశ వారసత్వం ఎంత గొప్పది. అలాగే మనకి 108 పురాణాలు, 108 ఉపనిషత్తులు ఉన్నాయి. చాలా శక్తివంతమైన శ్రీ చక్ర యంత్రం కూడా 108 కోణాలుగా విభజింపబడి ఉంటుంది. 54 బిందువులు పరస్పరం ఒక స్త్రీ, పురుష సంయోగానికి సూచన. స్త్రీ పురుష సంగమాన్ని, స్త్రీ పురుషుల స్వభావాలను సూచించే విధంగా ఖండిచుకుని 108 కోణాలుగా అద్భుతంగా ఆవిష్కరింపబడ్డ రూపమే శ్రీ చక్రం. శ్రీ చక్ర యంత్రం హిందువులకు పరమ పవిత్రం. దీన్ని పూజించడం వలన సంపద ,ఆధ్యాత్మిక చింతన వస్తాయి అని నమ్ముతారు. ఇందులో గల ప్రతీ త్రికోణంలో 180లీ ఉంటాయి. ఇందులో 4 పైకి చూసే దిశలో,5 క్రిందకి చూసే దిశలో పరస్పరం సంయోగింపబడి ఉంటాయి. 4+5 మొత్తం 9 త్రికోణాలు. పై దిశలో ఉన్న త్రికోణాలు పురుష తత్వమైన శివ రూపం. క్రింది దిశ వైపు చూస్తున్న కోణాలు స్త్రీ రూపమైన అమ్మ పార్వతీదేవి సంకేతం. కనుక, శ్రీచక్ర రాజ యంత్రము ప్రకృతి పురుషులైన శివ పార్వతుల ప్రతిరూపం. అంటే ఆది అంతాల ఆధ్యాత్మికతకు సంకేతం. శ్రీ చక్రం ఆదిదంపతుల కలయిక సూచిస్తుంది. దేవీ రూపాలను 9 దైవిక మైన అవతారాలుగా,నవదుర్గలుగా పూజిస్తాం. కి గణితంలో 1,2,3 ల పవర్ ను హైపర్ ఫ్రాక్టల్ గా కొలుస్తాము.

1×1 **పవర్ =1**
2×2 **పవర్ =4**
3×3ర్డ్ **పవర్ = 27** (3x3x3)

పైవన్నీ హెచ్చిస్తే 1x4x27=108 మళ్లీ 9 వస్తుంది. సంస్కృతంలో 54 అక్షరాలను శివ మరియు శక్తి స్వరూపంగా చూస్తారు. 54 అక్షరాలు స్త్రీ పురుషులకు రెండు సార్లు గణించాలి. మొత్తం 54X2 = 108. ఆయుర్వేదంలో 108 మర్మ బిందువులుంటాయి. ఈ 108 మర్మ బిందువులు ముఖ్యమైన జీవాన్ని, జీవులకు అందిస్తాయి అని ఆయుర్వేద శాస్త్రం పేర్కొన్నది. అలాగే 108 శక్తినిచ్చే పీడన స్థానాలు శరీరాన్ని జాగృత పరుస్తాయి అని పేర్కొన్నారు. మన గుండె కొట్టుకునే వేగం నిమిషానికి 72 సార్లు. 7+2=9 108 డిగ్రీల ఫారన్ హీట్ ఉష్ణం మన దేహం లోని వ్యవస్థ దెబ్బతినకుండా ఉండడానికి తోడ్పాటు నందిస్తుంది. కనుక 108 సంఖ్య మనో బుద్ధి పై నియంత్రణ మరియు మన గమ్యం ఏమిటో స్పష్టమైన అవగాహన కలిగిస్తుంది. చాలా వరకు భారతీయ నిర్మాణాలలో, ఇతర దేశాల చారిత్రాత్మక కట్టడాలలో కూడా 108 సంఖ్య ప్రాధాన్యత వహించింది. గణితం, వేదం, జ్యోతిషం 108 సంఖ్య ఆధారం చేసుకుని ఒక శాస్త్రరూపంలో విశ్వ రహస్యాలను మనకి అందిస్తున్నాయి. ఓం నమః శివాయ..!!మిగతా జ్యోతిష శాస్త్ర విషయాలు మళ్ళీ ఇంకొక పోస్ట్ లో తెలుసుకుందాం. లోకా సమస్తా సుఖినోభవంతు. ఓం శాంతిః శాంతిః శాంతిః

# మెటుపల్లి విద్యార్థిని నిజామాబాద్ లో దొరికింది

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి కోరుట్ల నియోజక వర్గం**

ఇబ్రాహింపట్నం మండలం లోని అమ్మక్కపేట గ్రామానికి చెందిన చింతల ప్రవీణ్ కూతురు అక్షర మెటుపల్లిలోని విజ్ డం హై స్కూల్ లో పదవ తరగతి చదువుతున్నది. అదే స్కూల్ కు చెందిన హాస్టల్ లో ఉంటున్నది. మొన్న అనగా డిసెంబర్ 5వ తేదీన బయటకు వెళ్లిన విద్యార్థిని తిరిగి హాస్టల్ కు చేరుకోలేదు. ఈ విషయాన్ని నిన్న డిసెంబర్ 6న స్కూల్ యాజమాన్యం అక్షర తల్లిదండ్రులకు విషయం తెలిపారు. అమ్మాయి తల్లిదండ్రులు తెలిసిన చోట వాకబు చేసి ఫలితం లేకపోవటంతో మెటుపల్లి పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని మెటుపల్లి సిఐ శ్రీ నిరంజన్ రెడ్డి తెలిపారు. నిన్న మీడియాకు తెలిపారు. ఇదిలా ఉండగా విద్యార్థిని నిజామాబాద్ లో క్షేమంగా పోలీసులకు దొరికింది. సమాచారం అందుకున్న మెటుపల్లి పోలీసులు అమ్మాయిని మెటుపల్లి పోలీస్ స్టేషన్ కు





విద్యార్థినిని విచారిస్తున్న మెటుపల్లి సిఐ నిరంజన్ రెడ్డి మరియు మెటుపల్లి ఎస్ఐ

తీసుకుని వచ్చి విచారించి తల్లిదండ్రులకు అప్పగించారు. మెటుపల్లి పోలీసులు సకాలంలో స్పందించడం వల్ల అన్నిచోట్లా పోలీసులు అప్రమత్తం కావడం,సోషల్ మీడియాలో ఈ విషయం సర్కులేట్ కావడం వల్ల మొత్తానికి విద్యార్థిని తొందరగా క్షేమంగా దొరకడం పట్ల విద్యార్థిని తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేసారు. తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు ఎప్పుడూ జాగ్రత్తలతో ఉండాలని,స్కూల్ యాజమాన్యాలు,హాస్టల్ నిర్వాహకులు వారిని ఎప్పుడూ గమనిస్తూ ఉండాలని ఈ సంఘటన తెలియజేస్తున్నది.

# రాష్ట్రవ్యాప్తంగా పుట్టిన గ్రామానికి పేరు తీసుకొచ్చిన సీనియర్ క్రీడాకారుడు. సంతోష్



**- ప్రైవేట్ పాఠశాల పిడి సంతోష్...**
**- టగ్ ఆఫ్ వార్ రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడికి ఘన సన్మానం....**

**కరపత్రం :శంకరపట్నం డిసెంబర్ 6**

తెలంగాణ రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కొరిమి సంతోష్ కుమార్ ను తన స్వగ్రామం కు చెందిన, క్రీడా సంఘాల బాధ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడారు. కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం, తాడికల్ గ్రామానికి చెందిన కొరిమి సంతోష్ ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. గ్రామానికి చెందిన తోటి క్రీడాకారులు గ్రామస్తులు సంతోషను శాలువాలతో పూలమాలతో ఘనంగా సన్మానం చేసి అభినందనలు తెలిపారు. టగ్ ఫర్ క్రీడాకారులను సంతోష్ తన నైపుణ్యంతో ప్రోత్సహించి, వేసవి కాలంలో ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని, సంతోష్ సేవలను గుర్తించి, టగ్ ఆఫ్ వార్ ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా నియామకం నియామకమయ్యారని, తాడికల్ గ్రామానికి రాష్ట్రవ్యాప్తంగా పేరు తీసుకువచ్చిన రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు సంతోష్ ను గ్రామస్తుల క్రీడా సంఘాల బాధ్యుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు శాలువాలతో పూలమాలలతో ఘనంగా సన్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యోగ, రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, మహ్మద్ కరీం, ఫిజికల్ డైరెక్టర్ బత్తిని జ్యోతి, సీనియర్ ఖోఖో క్రీడాకారులు జనగాం శ్రీనివాస్ గౌడ్, పూదరి మొగిళి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


# ప్రపంచానికే మార్గదర్శకులు అంబేద్కర్...

**- యువత ఆదర్శంగా తీసుకోవాలి....**
**- టీపీసీసీ సభ్యులు మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్..**

**కరపత్రం శంకరపట్నం. డిసెంబర్ 6**

ప్రపంచానికే తన మేదస్సును చాటి అనేక దిక్సూచిలను చూపించిన ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆయనను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని శంకరపట్నం మండలం మాజీ జడ్పిటిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ యువతకు సూచించారు. భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 68వ మహా పరి నిర్వహణ, వర్ధంతి వేడుకలను తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు అంతడుపుల సతీష ఆధ్వర్యంలో శంకరపట్నం మండల కేంద్రంలో నిర్వహించారు. మండలంలోని మొలంగూర్, కన్నాపూర్, ధర్మారం తాడికల్, కల్వల, ఆముదాలపల్లి లింగాపూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయా గ్రామాల్లో ఆయనకు ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి టపిసిసి సభ్యులు, శంకరపట్నం మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస గౌడ్ మండల కేంద్రంలో హాజరై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్






అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులర్పించి మాట్లాడారు. అంబేద్కర్ కన్న కలలను, ఆశయాలను సాధించడమే అంబేద్కర్ కు నిజమైన నివాళి, ప్రపంచ మేధావి మహనీయులు అంబేద్కర్ ఆయన ఆశయాలను యువత అనుదినం అనుసరిస్తూ రాజ్యాంగబద్ధంగా నడుచుకొని, ఎస్సీ, ఎస్టీ ,బీసీ ,మైనారిటీ, అగ్ర పేదల కుటుంబాల అభివృద్ధి అంబేద్కర్ లక్షయమని, అంబేద్కర్ కలలను ప్రతి ఒక్కరూ సహకారం చేసేందుకు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ వైస్ ఎంపీపీ పులికోట రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ సర్పంచ్, గట్టు తిరుపతి గౌడ్, బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్, బీఎస్పీ మండలాధ్యక్షుడు దేవునూరి భాస్కర్, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి ,జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, మాజీ సర్పంచులు గొడశాల రాజ కొమురయ్య,దాసారపు భద్రయ్య, కాటం వెంకట రమణారెడ్డి, రహీం, మాదిగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సముద్రాల సంపత్, బిసి దళిత మోర్చా మండలాధ్యక్షుడు కనకం సాగర్, రైతు ప్రజాసంఘాల జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు, ప్రజా సంఘాల, దళిత సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మిని క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న :- దుద్దిళ్ల శ్రీనుబాబు .

**కరపత్రం రామగిరి ప్రతినిధి డిసెంబర్ 6**

రామగిరి మండలంలోని సెంటనరీ కాలనీ లో MCPF రామగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారి సోదరుడు యువ నాయకులు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీను బాబు గారు పాల్గొని కేక్ కట్ చేసి క్రైస్తవ సోదర,సోదరీమణులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసిన శ్రీను బాబు ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి. యావత్ తెలంగాణ ప్రజలు ప్రతి ఒక్కరూ ,ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలి క్రైస్తవ మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్ధనలు చేసిన శ్రీపాద ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు దుద్దిళ్ల శ్రీను బాబు ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపన్న, CNC టౌన్ అధ్యక్షులు కాటం సత్యం మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ ఆర్ కే డైరీ ఆధ్వర్యంలో పుస్తె, మెట్టల పంపిణీ..



**కరపత్రం ప్రతినిధి, వీణవంక, డిసెంబర్ 6.**

వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన పాడి రైతు గుంపుల చంద్రమౌళి– లక్ష్మి ల కుమార్తె, మేఘన వివాహానికి, శుక్రవారం ఎస్ ఆర్ కే డైరీ చైర్మన్ సతీష్ రెడ్డి పుస్తె, మెట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొక్యూర్మెంట్ ఆర్ ఎం సతీష్ రెడ్డి, జమ్మికుంట మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి, రూట్ సూపర్వైజర్లు ఆదర్శ్, సంతోష్, గ్రామ పాల సేవక్ ఎడెల్లి శ్రీనివాస్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి...

**కరపత్రం రామగిరి ప్రతినిధి డిసెంబర్ 6**



బారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పూర్తితో ముందుకు సాగాలని బీఆర్ఎస్పార్టీ పట్టణ అధ్యక్షుడు కాపురబోయిన బాస్కర్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్బంగా సెంటనరీకాలనీ మార్కెట్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ ఔన్నత్యాన్నిచాటి చెప్పారని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాపితం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని ఆయన కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో ప్రతి ఒక్కరు బాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేధరబోయిన కుమార్ యాదవ్, దామర శ్రీనివాస్,అసం తిరుపతి, బుర్ర శంకర్, గాజుల ప్రసాద్, దర్ముల రాజా సంపత్, మేడగోని రాజన్న, చెలకల జోవహర్, తుమ్మల అశోక్, విఐపి సదానందం, రొడ్డ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ 68, వ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన రామగిరి మండల బిజెపి పార్టీ నాయకులు

**కరపత్రం రామగిరి ప్రతినిధి డిసెంబర్ 6**



రామగిరి మండలం సెంటనరీ కాలనీ మార్కెట్ చౌరస్తాలో 66వ అంబేద్కర్ వర్ధంతిని బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానంతరం మండల అధ్యక్షులు మొలమూరు శ్రీనివాస్ గారు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం 75 సంవత్సరాల అయిన సందర్భంగా గత పది రోజులుగా అనేకమైన కార్యక్రమాలు చేయడం జరిగింది బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ దేశానికి మార్గదర్శకుడు .ఆయన రాజ్యాంగం అమలు చేసే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని ఆయన అన్నారు. మూడవసారి ప్రధానిగా నరేంద్ర మోడీ గారు అయ్యారంటే అది భారత రాజ్యాంగం పట్ల విశ్వాసం ఉండబట్టే ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మేరుగు శ్రీకాంత్, కుందారపు సంతోష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపల్లిలో ఎస్ ఆర్ కె మిల్క్ పార్లర్ ప్రారంభించిన మున్సిపల్ కౌన్సిలర్ మేడిపల్లి రవీందర్...

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట డిసెంబర్ 6.......**






కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లి మూడో వార్డులో ఎస్ఆర్కే మిల్క్ పార్లర్ మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లి ప్రజలకు మంచి మిల్క్ పార్లర్ అందుబాటులోకి రావాలని మేడిపల్లి వేణు ఆధ్వర్యంలో వార్డు సభ్యులకు స్వచ్ఛమైన పాలు పెరుగు మరియు స్వీట్స్ అందించడానికి కోసం మిల్క్ పార్లర్ ప్రారంభించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మూడో వార్డు కౌన్సిలర్ మేడిపల్లి రవీందర్ జమ్మికుంట మున్సిపల్ బిల్ కలెక్టర్ మేడిపల్లి మొగిలి ఆధ్వర్యంలో ఎస్ ఆర్ కె సంస్థ చైర్మన్ తో కలిసి పార్లర్ ఓపెన్ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో రామన్న పల్లె ప్రజలు యూనిటీ బృందం తదితరులు పాల్గొన్నారు

# డా. బి.ఆర్ అంబేద్కర్ కి గణ నివాళు లర్పించిన ఆర్.ఎస్.పి పార్టీ నాయకులు

**– వ్యవస్థాపకులు జాకట శ్రీనివాస్**

**కరపత్రం దినపత్రిక మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి.డిసెంబర్ 6**






మేడ్చల్ లోని రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ ప్రధాన కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ అధ్యక్షులు జె శ్రీనివాస్, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా జె శ్రీనివాస్ మాట్లాడుతూ అణిచివేతకు గురియైన జాతుల నుండి ఉద్భవించిన మహనీయుడు అంబేద్కర్, సమ సమాజ నిర్మాణం కోసం, బలహీన వర్గాల కోసం, పేద వర్గాల కోసం పోరాటం చేసిన సామాజిక, రాజకీయ, ఆర్థికవేత్త, విశ్వజ్ఞాని డా.బాబాసాహెబ్ అంబేద్కర్. కుల నిర్మూలన, సమ సమాజ స్థాపన కోసం తన తనువునంత ధారపోసిన త్యాగ శీలి స్ఫూర్తిప్రధాత.సామాజిక రాజకీయ సిద్ధాంతకర్త మానవ చరిత్రలో అత్యంత ప్రభావితమైన వ్యక్తుల్లో అంబేద్కర్ ఒక్కరూ. భారత దేశ ప్రజల సమస్యలను అంబేద్కర్ అర్థం చేసుకున్నంతగా ఎవరూ అర్థం చేసుకోలేదు, కాబట్టి అంబేద్కర్ చూపిన బాటలో ఆయన ఆశయ సాధన కొరకు, మనందరం నడవటమే భారత దేశానికి అన్ని విధాలా శ్రేయస్కరం అని జె శ్రీనివాస్ అన్నారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి అనగాల రాములు, కార్యనిర్వాహక కార్యదర్శి ముక్కెర లక్ష్మీనారాయణ, నాయకులు వెంకటేష్, కృష్ణ, గోవర్ధన్, రమేష్, బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. జె శ్రీనివాస్ ఆర్.ఎస్.పి పార్టీ అధ్యక్షులు కంటెస్టెడ్ మేడ్చల్ ఎమ్మెల్యే సెల్ నెంబర్ – 9704488777

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పూలమాలవేసినివాళులర్పించారు

**కరపత్రం దినపత్రిక మెదక్ నర్సాపూర్.**





మెదక్ జిల్లావెల్దుర్తి మండల కేంద్రంలో భారతరత్న డా.బి.ఆర్.అంబేద్కర్ గారి వర్ధంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెల్దుర్తి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి రాజి రెడ్డి, ప్రజాపాలన ప్రజా విజయోత్సవల సమన్వయకర్త జూలకంటి ఆంజనేయులు గార్లు.

అనంతరం బాలాజీ మీనీ ఫంక్షన్ హాల్లో గత సంవత్సర కాలంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల, సంక్షేమ పథకాల గురించి ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సంధర్బంగా మాట్లాడుతు బిఆర్ఎస్ తన 10 సంవత్సరాల పాలనలో చేయలేని ఎన్నో సాహసోపేత నిర్ణయాలను, ఎన్నో పనులను సీఎం రేవంత్ రెడ్డి నేడు అవలీలగా చేస్తూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన విధ్వంస పాలనను పునర్నిర్మాణం వైపు, అభివృద్ధి వైపు తీసుకువెళ్లేలా అడుగులు వేస్తున్నారు.ఏడాది పాలనలో సంపూర్ణ సహకారంతో రెండో సంవ్సరంలోకి అడుగుపెడుతున్నాం.రాష్ట్రంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారు అవినీతి రహిత పాలనను అందిస్తున్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్న బీఆర్ఎస్ నాయకులు, నేడు ఎమ్మెల్యేల చేరికపై కాంగ్రెస్పై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు.ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల విశ్వాసంతో ఉన్నారని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తమ తమ గ్రామాలలో అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో స్థానిక సంస్థల్లో సైతం ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మాజీ ఎంపిపి నరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్, వెల్దుర్తి మండల అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, మాసాయిపేట్ మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, వెల్దుర్తి పట్టణ అధ్యక్షులు మల్లేష్, ఆంజనేయులు, నర్సాపూర్ మండల ఒబీసీ సెల్ అధ్యక్షులు అశోక్ గౌడ్, ముక్తా భాయ్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ గణిత ప్రతిభ పోటీలు.....

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట: డిసెంబర్ 6 ....**




గణితాన్ని నేర్చుకోవడం ద్వారా ప్రపంచ విజ్ఞానవంతులు కావచ్చునని, గణిత శాస్త్రాన్ని అధ్యాయనము చేయడం పిల్లలు అలవాటుగా చేసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులచే బోధన కొనసాగుతున్నదని ఉపాధ్యాయుల సూచనలు అనుసరించి విద్యార్థులు చక్కటి ఫలితాలు సాధించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) లో జరిగిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జమ్మికుంట మండల విద్యాధికారి శ్రీమతి హేమలత విద్యార్థులకు పిలుపునిచ్చారు. గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గంగిశెట్టి జగదీశ్వర్ నిర్వహణలో, చిటికెన వేణు సమన్వయముతో జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు గణిత ప్రతిభ పాటవ పోటీలను నిర్వహించగా జమ్మికుంట మండలం నుండి జె ఆశ్లేష,చీహెచ్ చందన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నారు. ఇల్లంతకుంట మండలం నుండి ఓ.గణేష్ ఇల్లంతకుంట.ఏ.హాసిని సిరిసేడు. ప్రథమ ద్వితీయ బహుమతులు అందుకున్నారు. ఉభయ మండలాల నుండి ఎస్. పవన్ కుమార్ వావిలాల. ఎండి ముష్కన్ బాయ్స్ జమ్మికుంట ప్రథమ ద్వితీయ బహుమతులు అందుకొనగ పి.పద్మారామ కేజీబీవీ ఇల్లంతకుంట, సి.హెచ్ ఈశ్వర్ గర్ల్స్ జమ్మికుంట. కె చందన కోరపల్లి,బిహాసిని కోరపల్లి, జి స్పందన కోరపల్లి, ఈ ఆకాంక్ష రాచపల్లి, బి అమర్నాథ్ కొత్తపల్లి విద్యార్థిని విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల( బాలురు) ప్రధానోపాధ్యాయులు ఎన్ .సదానందం , మర్రి అవినాష్, రావికంటి రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, వివిధ పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రజా పాలన నా..లేక.. అక్రమ అరెస్టుల పాలన నా..!!

**– నిరంకుశ పాలనకు నిలువుటద్దం...వీణవంక బిఆర్ఎస్ నాయకులు...**

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, డిసెంబర్ 6.**

వీణవంక మండలంలోని పలువురు బి ఆర్ ఎస్ నాయకులను హైదరాబాద్ వెళ్లకుండా, శుక్రవారం వీణవంక పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ని కలిసేందుకు,కేటీఆర్ మీటింగ్ కు హైదరాబాద్ వెళ్లకుండా మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి ని, రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పోతుల నర్సయ్య , కొండపాక మాజీ ఎంపీటీసీ నల్ల మమత తిరుపతి రెడ్డి ను ముందస్తు అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్ కు తరలించారు. బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తుందో.. లేక.. కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టుల పాల నడుస్తుందో.. తెలంగాణ ప్రజానీకం గమనిస్తుందని, తెలంగాణలో నిరంకుశ పాలన నడుస్తుందని, ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన,6 గ్యారంటీల హామీని మర్చిపోయి, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని గుర్తు చేసినందుకే, అక్రమ అరెస్టులను ప్రోత్సహిస్తుందని, ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణను కొట్లాడి తెచ్చిన మహనీయుడు, రెండు పర్యాయాలు తెలంగాణను అగ్రస్థానంలో నిలిపి ఉత్తమ పాలన అందిస్తూ, ప్రపంచ దేశాల ప్రశంసలు పొందిన గొప్ప మేధావి, తెలంగాణ ప్రజలు ఆరు గ్యారెంటీ లతో మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, పూర్తిస్థాయిలో రుణమాఫీ, రైతు భరోసా మర్చిపోయి, తెలంగాణ రైతంగాన్ని మోసం చేస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఓటుతో ప్రజలే సమాధానం చెప్తారని అన్నారు.

